# ఔట్ సోర్సింగ్ - సర్జనులు

ఇంతకు ముందు ఔట్‌సోర్సింగ్-ఒకటి, ఔట్‌సోర్సింగ్-మరోటి, ఔట్ సోర్సింగ్-ఇంకోటి అని మూడుసార్లు ఈ కబుర్లలో చెప్పుకున్నాం. శ్రీశ్రీ కవిత్వమొక తీరని దాహం అన్నాడు. ఈ ప్రపంచీకరణ రోజుల్లో ఔట్‌సోర్సింగ్ కూడా ఒక తీరని దాహమే. అందుకే ఈ ఔట్‌సోర్సింగ్ మీద ఇంకో మూడు వ్యాసాలు వ్రాస్తున్నాను. అన్నీ వరసగాకాదు. మధ్యమధ్యలో కొంచెం ఊపిరి పీల్చుకుంటూ. ఎందుకంటే ప్రతి వ్యాసానికీ వెనుక కనీసం పది రోజుల సమాచార సేకరణా, పరిశోధనా వున్నాయి మరి. ఈసారి శీర్షిక పేరు ఔట్‌సోర్సింగ్ - సర్జనులు. సజ్జనులు కాదు సర్జనులు. 'సర్జనులు సజ్జనులు కాదు' అని కాదు నా భావం. రాజుగారి రెండో భార్య ఎందుకు మంచిదో చెప్పుకుందామని. మొదటి భార్య కథ అప్రస్తుతం కదూ!

0 0 0

ఔట్‌సోర్సింగ్ ముందు హార్డ్‌వేర్‌తోనూ, ఇతర మెషీన్ భాగాలతోనూ ఎనభైలలోనే మొదలయింది. భారతదేశం ఆర్థిక పురోగమనంలో ముందుకు పోలేక పోయింది. తర్వాత నరసింహారావ్ మన్మోహన్‌సింగ్ చిదంబరాల ముందుచూపుతో ముందుకు కదిలింది. ఏ లేబర్ సమస్యలూ లేని సాఫ్ట్‌వేర్ రంగం ప్రపంచంలోనే ప్రధమ స్థానంలో వున్న మన సాఫ్ట్‌వేర్ నిపుణులతో ఈ జగన్నాధ రధాన్ని కదిలించింది. తత్ఫలితంగా బెంగుళూర్, చెన్నై, నయోడ, ముంబై ముందడుగు వేశాయి. తరువాత ఔట్‌సోర్సింగ్ వల్ల మన దేశానికి వచ్చినవి కాల్ సెంటర్లు. వీటి తర్వాత...

0 0 0

అమెరికాలోని ఎన్నారైలు ఈ అవకాశాల పరిశీలనలో చాలముందే వున్నారని చెప్పొచ్చు. ఏనాడో అమెరికా వచ్చి ఎన్నో రంగాల్లో అనుభవమూ నైపుణ్యమూ సంపాదించి వాటిని మాతృభూమికి తరలించటానికి ముందుకు వస్తున్నారు. కొంతమంది విదేశాలనించే పనిచేస్తుంటే మరి కొంతమంది భారతదేశానికి తిరిగివెళ్ళి అక్కడ ఏనాడూ ఎరగని ప్రాడక్టులు సర్వీసులు ఔట్‌సోర్సింగ్ చేయటంలో సమయం డబ్బూ కేటాయిస్తున్నారు. ఇండియాలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల్లో లంచాలు, ఎర్ర టేపు పూర్తిగా పోకపోయినా, కొంతవరకూ తగ్గాయని మిత్రుల ఉవాచ. అవి పూర్తిగా తగ్గి సభ్య ప్రపంచలోని మిగతా దేశాలకు మల్లే చక్కటి పారిశ్రామిక వాతావరణం కల్పిస్తే, ఇంకా త్వరగా ఎక్కువగా అభివృద్ధి సాధించే అవకాశం వుంది అని ఇంతకు ముందే చెప్పుకున్నాం.

ఈసారి వైద్య రంగానికి సంబంధించినవి ఈ ఔట్‌సోర్సింగ్‌లో ఎలా మన దేశానికి వస్తున్నాయో చూద్దాం. కొంచెం పరిశీలనగా చూస్తే ఇవి మూడు రకాలుగా జరుగుతున్నట్టు అనిపిస్తున్నది.

ఒకటి: శ్రీలంక బంగ్లాదేష్ నేపాల్ పాకిస్థాన్‌లాటి పొరుగుదేశాలనించీ, మన దేశానికి వైద్యంకోసం ముఖ్యంగా శస్త్రచికిత్సలకి ఏనాటినించో వస్తున్నట్టు మనకి

తెలుసు. దురదృష్టవశాత్తూ మన ప్రభుత్వ డాక్టర్లు వసతులు ఆసుపత్రులు అంతర్జాతీయ స్థాయికి ఎక్కడా దరిదాపుల్లో లేనందున, ఇలాటివారు ప్రైవేటు డాక్టర్లకీ వసతులకీ ఆసుపత్రులకీ మాత్రమే రావటం జరుగుతున్నది. అందువల్ల ఆర్థికంగా ఏ ఇబ్బందులు లేనివారికీ, ఏ సచ్ఛంద సేవా సంస్థలో ముందుకి వచ్చి ఆర్థిక సహాయం చేస్తేనో వారికివి అందుబాటులోకి వస్తున్నాయి. చెన్నైల్లో, ఢిల్లీలో తదితర నగరాలలోనూ ఎన్నారైలు స్థాపించిన అపోలో, ఎస్కార్ట్ ఆసుపత్రులు మన పొరుగుదేశాల వారినే కాకుండా ఆఫ్రికా గల్ఫ్ దేశాలనించీ కూడా ఎంతోమందిని ఆకర్షిస్తున్నాయి.

రెండవది: ఇంగ్లండ్, కెనడా మొదలైన దేశాల్లో ప్రభుత్వమే ప్రజలకి వైద్య సదుపాయాలు అందిస్తుంది. అక్కడ సదుపాయాలకి ఏ లోటూ లేకపోయినా, అన్నీ ఉచితం అనేసరికి చిన్న ఆపరేషన్ల దగ్గరినించీ పెద్దవాటి దాకా, పెద్ద క్యూలున్నాయి. కొన్ని ఆపరేషన్లకయితే సంవత్సరం దాకా ఆగాలిట. అందుకని ఆర్థికంగా సమస్యలు లేనివారు, తత్వర సహాయంకోసం బయటి దేశాలకి పోవటానికి వెనుకాడటం లేదు.

మూడు: అమెరికాలాటి దేశాల్లో వైద్య సహాయానికీ, నైపుణ్యానికీ, సదుపాయాలకీ ఢోకా లేదు. ప్రపంచంలోనే మొదటి స్థానంలో వుంది. ఇక్కడ మెడికల్ ఇన్సూరెన్స్ ఉద్యోగస్తులకీ రిటైర్ అయినవారికీ వుంటుంది. కాకపోతే ఏ ఇన్సూరెన్సూ లేనివారికి తడవకుండానే మోపెడవుతుంది. అది మోయలేక మునగలేక వేరే దేశాలకి పోవటం ఈమధ్య ఎక్కువయింది.

ఈ నేపథ్యంలో మెడికల్ ఔట్‌సోర్సింగ్‌లో భారతదేశం ఈ అవకాశాలని ఎలా ఉపయోగించుకుంటున్నదో చూద్దాం. ఇంగ్లాండ్, కెనడా తదితర దేశాలనించీ ఇండియాకి చికిత్స కోసం వచ్చేవారిలో పెద్ద శాతం ఎన్నారైలు. ఇండియాలో వారికి ఇంకా బంధుత్వాలూ స్నేహాలూ వుండటం వల్ల, ఏవి మంచి హాస్పిటళ్ళు, ఎక్కడ మంచి చికిత్స లభిస్తుంది అనే సమాచార సేకరణ వారికి సులభమవుతుంది. అంతేకాక అమెరికానించీ ఇండియాకి తిరిగి వెళ్ళిన డాక్టర్లతో వారికి పరిచయం వుండే అవకాశం కూడా వుంది. ఈమధ్య ఇంగ్లండ్ నేషనల్ హెల్త్ సర్వీస్, కెనడా నేషనల్ హెల్త్ ప్లాన్లలో పేషంట్లు వేచివుండటం ఎక్కువయేసరికి ఆ దేశస్థులు కూడా బయటికి తొంగిచూడటం మొదలుపెట్టారు. వీళ్ళకి వైద్య సహాయం ముఖ్యంగా ఇచ్చేది మన సర్జనులు. విదేశాల్లో ఎక్కడ ఏ హాస్పిటల్లో చూసినా ఇండియన్ డాక్టర్లు కనపడుతూనే వుంటారు. వాళ్ళకి సజ్జనులైన సర్జనులని పేరు కూడా వుంది. అందుకని వాళ్ళకి మన వైద్యుల మీదా, వైద్యం మీదా నమ్మకం బాగానే వుంది. ఇక ఖరీదు అంటారా. బలే మంచి చౌక బేరం అయింది. అది ఎలాగో చూద్దాం.

రిచర్డ్ అట్టెన్బరో తీసిన గాంధీ సినిమాకి ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేసిన బ్రిటిష్ ఆయన అలెక్జాండర్ డి గ్రన్వాల్డ్‌కి భరించలేనంత మోకాలు నొప్పి వచ్చింది. వస్తున్న సంపాదనకి మోకాలు అడ్డం పెట్టటం ఎందుకని ఆయన ఆపరేషన్ చేయించుకుందామని నిర్ణయించుకున్నాడు. బాంబేలోని బ్రీచ్ కాండీ హాస్పిటల్లో చేరాడు. మోకాలు మార్పిడికి వాళ్ళ దేశంలో మన లెఖ్ఖల ప్రకారం పదినించీ పన్నెండు లక్షల రూపాయల ఖర్చవుతుందన్నారు. పైగా వైటింగ్ పీరియడ్ ఆయనకి ఆపరేషన్ ఇండి

యాలో వెంటనే చేశారు. ఖర్చు 2-3 లక్షలు. మిగిలిన డబ్బులతో కొంత ఖర్చు పెట్టి సుందర కేరళ, రాజస్థాన్‌లు కూడా చూసి వచ్చానన్నాడు. అక్కడి డాక్టర్ల నైపుణ్యం, మంచితనం మెచ్చుకున్నాడు కూడాను. అలాగే బోన్ మారో మార్పిడి చేయాలంటే అమెరికాలో కోటి రూపాయలదాకా అయితే, ఇండియాలో పదకొండు లక్షలు అవుతుందిట. లండన్‌నించీ కీత్ అనే ఆయన్ని హృదయ ఘోష తగ్గటం కోసం నెలరోజులు థెరపీ చేయించుకోమన్నారు. ఇంగ్లాండ్‌లో పది లక్షలు అవుతుందన్నారు. ఆయన నెల రోజులకి 35000 రూపాయలు అద్దె కట్టి ఎపార్ట్‌మెంట్లో వుండి, ఢిల్లీలో ఎస్కార్ట్స్ హార్ట్ హాస్పిటల్లో థెరపీ చేయించుకున్నాడు. మొత్తం 80 వేల రూపాయలయింది. వస్తూ వస్తూ దారిలో తాజ్ మహల్ కూడా చూసి వచ్చానన్నాడు.

ఇంగ్లండ్ టెస్టులు ఆడటానికి ప్రయత్నం చేస్తున్న ఒక క్రికెట్ ప్లేయర్‌కి భుజకీర్తులు బాగానే వున్నాయి కానీ, కుడిభుజం జారిపోయి బౌలింగ్ చేయలేక పోతున్నాడుట. అతన్ని హాస్పిటల్లో ఖాళీ లేదని ఆనక అంటే రెండేళ్ళు ఆగి మరీ రమ్మన్నారుట. అతను ఆగలేక ఇండియా వచ్చిన మర్నాడే ఏదో వంతు ఖర్చుతో, పని (అంటే ఇంగ్లీషులో ఆంత్రోస్కోపిక్ షోల్డర్ సర్జరీ అనగా తెలుగులో భుజాన్ని పీకేసి కెలికేసి, మళ్ళీ పెట్టేసి కుట్టేయటం) పూర్తిచేసుకున్నాడు. అతను ముంబాయ్ నించీ వస్తూ వస్తూ దారిలోనే కదా అని గోవా బీచ్ కూడా చూసి వచ్చానన్నాడు.

అమెరికానించీ ఒక అమెరికనాయన ఇండియా వెడుతున్నానంటే అస్మదీయులంతా, ఆ మురికీ ఈగలూ వాతావరణం ఎలా భరిస్తావు మళ్ళీ తిరిగిరావటానికి రిటర్న్ టిక్కెట్టు ఎందుకన్నారుట. అతనికి అమెరికాలో వైద్యం చేస్తున్న ఇండియన్ డాక్టర్ సలహా మీద, ఇన్సూరెన్స్ లేని కారణాన మొండిగా ఢిల్లీ వెళ్ళాడుట. ఆయనకి హృదయ కవాటాలు సరిగ్గా తెరుచుకోవటం లేదనీ, ఆంజియోప్లాస్టి చేయాలన్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌నించీ హోటల్‌కి వెడుతున్నప్పుడే ఆయన భార్య అన్నదిట ఇక్కడ శుభ్రంగా లేదు వెళ్ళిపోదామని. అతను కాదూ కూడదూ అని హాస్పిటల్లో చేరాడు. సర్జరీ అయాక డాక్టర్లనీ, వారి నిపుణతనీ, హాస్పిటల్లో ఆతిథ్యాన్నీ, పరిశుభ్రతనీ తెగ మెచ్చుకున్నాడు. 'నేను మళ్ళీ అవసరమైతే తప్పకుండా ఇక్కడికే వస్తాను. అంతేకాదు అక్కడ తెలిసిన వాళ్ళకి ఇక్కడికే రమ్మని సిఫారసు చేస్తాను' అని కూడా అన్నాడు.

ఢిల్లీలోని ఎస్కార్ట్స్ హాస్పిటల్ లెఖ్ఖల ప్రకారం, మూడేళ్ళ క్రితం మూడు శాతం విదేశీయులు సర్జరికి వస్తే ఇప్పుడది పది శాతం దాటింది. అపోలో హాస్పిటల్ లెఖ్ఖ ప్రకారం, గత ఐదేళ్ళలో 55 దేశాలనించీ అరవై వేల మంది విదేశీయులు సర్జరీలు చేయించుకున్నారుట! కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఆరోగ్య శాఖ ప్రతినిధి ఏమంటాడో తెలుసా? పోయిన సంవత్సరం లక్షా యాభై వేల మంది విదేశీయులు వైద్య సహాయం కోసం ఇండియాకి వచ్చారనీ, ఈ సంఖ్య ఏటేటా పదిహేను శాతం చొప్పున పెరుగుతున్నదనీ అన్నాడు.

ఇకనించీ మరి, ఆరోగ్యమే మహాభాగ్యం అనే దాన్ని ఆ రోగమే మహా భాగ్యం అనుకోవాలేమో!

0 0 0